# కమ్యూనిస్టు గాడిద

చాకలి రాములుకు పూట గడవటం కష్టమయిపోయింది. అతని పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. ఎంత దిగజారిపోయిందంటే తను, తన కుటుంబం వారానికి-నాలుగు రోజులు పస్తులుండాల్సి వస్తే గాడిదను మాత్రం వారం అంతా పస్తులుంచే స్థితికి దిగజారిపోయింది. ఆ కారణంగానే అతని గాడిద పూర్తిగా చిక్కి శల్యమై చావుకి కాళ్ళు జాపుకు కూర్చుంది.

గాడిద తన కళ్ళెదుటే చస్తూ వుండటం చూసి వూరుకోలేక రాములు దాన్ని వీధిలోకి తరిమెయ్యాలని నిర్ణయించుకొన్నాడు. అనుకొన్నదే ఆలస్యంగా కట్లు విప్పి గాడిదను వీధిలోకి తోలేశాడు.

వీధిలో పడ్డ గాడిద యజమానికేసి విస్తుపోయి విచారంగా చూసింది. ఆ చూపుల ధాటికి తట్టుకోలేక చాకలి రాములు ''వెళ్ళు వెళ్ళి నీ బ్రతుకేదో నువు బ్రతుకు'' అంటూ రెండు తగిలించి గుడిసెలోకి వెళ్ళి దభీల్న తలుపులు వేసుకున్నాడు.

కొద్దిసేపటి వరకూ ఏమీ పాలుపోక, ఎటూ తేల్చుకోలేక అలా వీధిలోకి నిలువునా నిలబడిపోయింది గాడిద. ఆ తర్వాత ఎటువెళ్ళాలో దానికి తోచలేదు. ఇటు చూస్తే మైదానాలు దాని కళ్ళల్లో మెదిలాయి. ఎటకేగుటకో సమస్యగా ఘనీభవించింది గాడిదకు. ఊళ్ళోకి వెళ్ళి సినిమా పోస్టర్లు, చిత్తు కాగితాలు మేయాలంటే ట్రాఫిక్‌ను తప్పుకోవడానికి నానా హైరానా పడాలి. పైగా తినటానికి అక్కడ నీళ్ళు కూడా దొరికే అవకాశం లేదు. అందుచేత వూరి చివరికి వెళ్ళి పచ్చగడ్డి మేసి కాలువలో పచ్చి మంచినీళ్ళు తాగవచ్చుననుకొని కాళ్ళీడ్చుకొంటూ వూరి చివరికి నడిచింది.

అలా కాళ్ళీడ్చుకొంటూ వూరు చివరకు చేరుకొనేసరికి గాడిదకు పూర్తిగా నిరాశే ఎదురైంది. పచ్చగడ్డి మచ్చుకైనా కనిపించలేదు. కాలువొడ్డున ఏమైనా

వుంటుందేమోనని అక్కడికి జాగ్రత్తగా వెదికి చూసింది. పాపం ఆ గాడిదకేం తెలుసు. దేశంలో తెలుగు దేశం, కాంగ్రెస్ వర్గాల మధ్యన పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేట్లుగా వుందని, ఆ వూళ్ళోకూడా యీ రెండు వర్గాల వారు వున్నారని, యిహ పచ్చగడ్డి ఎక్కడుంటుందనీను-

ఆనక చేసేది లేక అగ్ర కులాల వాళ్ళు ఎవరైనా చూస్తారని భయం భయంగా అటూ యిటూ చూసి కాలువలోని నీరు గట గటా త్రాగేసి వెనక్కి తిరిగి వూరుకేసి నడకసాగించింది.

ఊళ్ళో కొచ్చింతర్వాత అది చిత్తు కాగితాల కోసం రోడ్లన్నీ కలియ తిరిగింది. ఎక్కడా చిన్న కాగితం ముక్కయినా కనిపించలేదు. అంతకు చాన్నాళ్ళముందే దేశంలో కాగితం కొరత ఏర్పడిందని అందువల్ల ప్రభుత్వం కాగితాల మీద కంట్రోలు ఏర్పాటు చేసిందనీ, అప్పట్నుంచీ ప్రజలు మరియు పత్రికలవాల్ళు కాగితాన్ని బహు జాగ్రత్తగా వాడుకుంటున్నారని, అందుకని చెత్త కుండీలలో కూడా వక్క కాగితం - ముక్క కనబడకుండా పోయిందనీ ఆ గాడిదకు తట్టలేదు. తట్టింతర్వాత దాని బుర్రలో మరో లైటు వెలిగింది. ఇహ సినిమా పోస్టర్లే గత్యంతరమని వాటికేసి చూసింది.

పచ్చగడ్డి చిత్తు కాగితాలు దొరక్కపోతే గాడిదలూ, గేదెలూ, గోవులూ అన్నీ కలిసి మూకుమ్మడిగా సినిమా పోస్టర్లమీదకి ఎగబడవచ్చునని ముందుగానే వూహించి సినిమాల వాల్ పోస్టర్లు చాలా ఎత్తున వేళ్ళాడేసేరు. అందుకని గాడిదకు యీసారి కూడా ఆశాభంగమే కలిగింది. మొదటిసారిగా తను జిరాఫీ అయి పుట్టనందుకూ, గాడిదయి పుట్టినందుకూ విచారించింది. ఆ తరువాత చేసేది లేక ఏం చెయ్యాలో తెలియక అచ్చం గాడిదలా వూరంతా కలియ తిరగసాగింది. అలా తిరుగుతూండగా దానికి కాంగ్రెసు పార్టీ వాళ్ళు గోడలమీద అతికించిన పోస్టర్ కనిపించింది. అది దానికి అందుబాటులో వున్నందున ఆలస్యం చేయకుండా ఆదరాబాదరా వెళ్ళి దాన్ని నాలికతో తడిపి వూడబెరికి తినసాగింది. దూరాన్నుంచి యీ వ్యవహారం గమనించిన కాంగ్రెసు కార్యకర్తకి ఖచ్చితంగా తెలుగుదేశం వాళ్ళపనే అనిపించి పరుగెత్తుకుంటూ వచ్చి అటుగా వెళుతున్న తెలుగుదేశం కార్యకర్తను పట్టుకుని నిలేసి ''ఏమిటిది?'' అని గాడిదకేసి చూపిస్తూ గర్జించేడు.

ముందు ఏమిటోనని విస్తుపోయిన తెలుగుదేశం కార్యకర్త, గాడిద కాంగ్రెసు పోస్టర్‌ని మేస్తూండడం చూసి అటు తర్వాత కాంగ్రెసు కార్యకర్త కేసి ఎగాదిగా చూసి, చచ్చు ప్రశ్నలు వేసిన పిల్లాడికేసి పంతులు చూసినట్టు చూసి ఫెళ్ళున పడీ పడీ విరగబడి నవ్వేడు.

ద్రౌపది నవ్వును జూసి యిన్సల్ట్ ఫీలయి ఆనక కోపగించుకొన్న దుర్యోధనుడిలా కోపంతో వూగిపోతూ ''గాడిదను తోలి తమాషా చూస్తున్నావట్రా గాడిద కొడకా'' అంటూ మొదలు పెట్టి తిట్లకు లంకించుకున్నాడు కాంగ్రెస్ కార్యకర్త.

''ఏం కూసావురా! నువ్వే గాడిద కొడుకువి'', అంటూ చేతులు పైకి మడిచి కాంగ్రెస్ కార్యకర్త మీదికి వురికాడు తెలుగుదేశం కార్యకర్త. జనం చుట్టూతా చూస్తుండగా యిద్దరూ కలియబడ్డారు. జనంలోని సింపతైజర్స్ రెండు వర్గాలుగా విడిపోయి తిట్టుకొంటూ కొట్టుకోసాగేరు. కొందరు మాత్రం ప్రేక్షకుల్లా చూస్తూ వుండిపోయేరు. జనం అంటే అంతా మామూలు మనుషులు కారు గదా! అందులోను కొందరు అడుక్కు తినేవాళ్ళూ, రౌడీలు, జేబు దొంగలూ, ఖూనీకోర్లూ, సి.ఐ.డి., పోలీసులూ వుంటారు. జనంలోంచి ఒక సి.ఐ.డి. వెళ్ళి పోలీసు స్టేషన్‌కి ఫోన్ చేసి వచ్చాడు.

వార్త అందుకోగానే ఎస్సయ్‌గారు అర్జంటుగా కానిస్టేబుళ్ళని వెంటపెట్టుకొని హుటాహుటిన బయలుదేరి వచ్చారు. పోలీసుల్ని చూడగానే పిల్లిని చూసిన ఎలకల్లా ఎక్కడివాళ్ళు అక్కడే గప్‌చిప్ అన్నట్టుగా జనమంతా తిట్టుకోవడం, కొట్టుకోవడం మానేసారు. ఇన్స్‌పెక్టరుగారు వ్యాన్ దిగడంతోనే కార్యకర్తలిద్దరిని పిలిచి ''ఏం జరిగిందని'' అడిగేడు.

కార్యకర్తలు యిద్దరూ (కాట్ల కుక్కల్లా) ఒకర్నొకరు చూసుకుని తిరిగి ఆవేశ పడిపోతూ ఒకర్నొకరు తిట్టుకుంటూ విన్నవించుకున్నారు, ''వీడు యీ గాడిదను తీసుకొచ్చి దగ్గరుండి మా పోస్టర్‌ని మేపుతున్నాడు'' అన్నాడు కాంగ్రెస్ కార్యకర్త. ''కాదు సార్ వీడే గాడిద చేత పోస్టర్‌ని మేపి మామీద అన్యాయంగా అపవాదు తోస్తున్నాడు'' అన్నాడు తెలుగుదేశం కార్యకర్త.

''ఒరేయ్ ఏం కూసావురా'' కోపంగా అన్నాడు కాంగ్రెస్ కార్యకర్త.

తల విదిల్చి ''కుయ్యడానికి నేనేమయినా గాడిదనట్రా నీలా'' అరిచాడు తెలుగుదేశం కార్యకర్త.

ఇహ తను చూస్తూ వూరుకుంటే వాళ్ళు తన్నుకోవడం తథ్యం అని తలచి ఇన్స్‌పెక్టరుగారు ''ఇక్కడ నేనుండగా మధ్యన మీ గొడవేమిటీ?'' అన్నాడు.

వాళ్ళిద్దరూ నోరు మూసుకున్నారు. ఇన్స్‌పెక్టర్‌గారు ఒక క్షణం ఆలోచించి, యింకా ఎక్కువసేపు ఆలోచిస్తే తను ఆ డిపార్టుమెంటుకి అనర్హుడనని జనం ఎక్కడ తేల్చిపారేస్తారోనన్నట్టుగా వెంటనే, ''ఆ గాడిదను అరెస్టు చేయండి'' అని కానిస్టేబుల్స్‌ని ఆజ్ఞాపించేడు.

ఏ గాడిదను అరెస్టు చెయ్యాలో తేల్చుకోలేనట్టుగా కానిస్టేబుల్స్ అంతా ఒకర్నొకరు చూసుకున్నారు. ఇన్స్‌పెక్టర్‌గారు ఎవర్ని వుద్దేశించి ఆ మాట అన్నారో వాళ్ళు ఎంతకీ తేల్చుకోలేక వూరకనే వుండిపోయారు.

అది చూసి ఇన్స్‌పెక్టర్ గారు కోపంగా, ''మిమ్మల్నే ఆ గాడిదను అరెస్టు చెయ్యమంటున్నది'' అని గాడిదకేసి చూపిస్తూ అరిచారు.

అప్పటిక్కాని తాము అరెస్టు చేయవలసింది ఎవర్నో అర్థం అయింది కాదు కానిస్టేబుల్స్‌కి. అర్థం అయింతర్వాత పోస్టర్ మేయడం పూర్తి చేసి జనాన్ని తప్పుకొని వెళ్ళడం సాధ్యంకాక నిలబడివున్న గాడిదను అరెస్టు చేశారు.

ఆ తరువాత యింకా ఎవర్ని అరెస్టు చెయ్యాలా అని యోచించారు ఇన్స్‌పెక్టర్‌గారు. అటు చూస్తే కాంగ్రెసు, యిటు చూస్తే తెలుగుదేశం, కేంద్రంలో కాంగ్రెసు, రాష్ట్రంలో తెలుగుదేశం, కనుక ఎవర్ని అరెస్టు చేసినా తన కొంప మునగడం ఖాయమని తలచి ఎవ్వర్నీ అరెస్టు చెయ్యకూడదని నిర్ణయించుకొని ''సాయంత్రం మీరిద్దరూ స్టేషన్‌కొచ్చి స్టేట్మెంట్ యివ్వండి'' అని చెప్పి వెనక్కి తిరిగి వెళ్ళి వ్యాన్ ఎక్కారు. ఇన్స్‌పెక్టర్‌గారి చర్య. కార్యకర్తలిద్దరికీ సబబుగానే తోచింది. అందుకని ఎవరి దారిని వారు వెళ్ళిపోయేరు.

ఇన్స్‌పెక్టర్ గారు వ్యాన్‌లో పోలీసు స్టేషన్‌కు వెళ్ళగానే కానిస్టేబుల్స్ వెనుక గాడిదను తోలుకొని తీసుకువెళ్ళి లాకప్‌లో వుంచారు.

ఇన్స్‌పెక్టరు గారు కుర్చీలో చేరబడి కాఫీకి ఆర్డరు యిచ్చి, సిగరెట్ అంటించి, పొగ పీల్చి వదుల్తూ ఆ పొగను చూసి ఆనందిస్తూ కేసు ఎట్లా ఫైల్ చెయ్యాలా అని ఆలోచించసాగేరు – ఇంతలో ఫోను మోగింది. విసుగ్గా రిసీవరు అందుకొని ''హల్లో'' అన్నాడు. అవతలివైపు నుంచి ఆ వూరి మునిసిపల్ చైర్మన్‌గారి కంఠం వినిపించగానే నోట్లోంచి సిగరెట్ జారి పడింది. కంగారుగా, ''నమస్కారం సార్'' (చెయ్యెత్తి) అన్నాడు.

అవతలి వైపు నుంచి తిరుగు నమస్కారం లేకుండానే ఛేర్మన్ గారి కంఠం వినిపించింది. ''ఇంతకుముందు పార్టీల మధ్యన పోట్లాటను గూర్చి మీ యిన్వెస్టిగేషన్ ఎంతవరకు వచ్చింది?''

''ఏమైంది సార్! గాడిదను అరెస్టు చేసి తీసుకొచ్చాం. ఫైల్ చేసి కోర్టుకి పంపించడమే ఆలస్యం. రేపు పొద్దున్నే ఎలాగైనా గాడిదను కోర్టుకు పంపిస్తాను సార్'' అని జవాబిచ్చేడు ఇన్స్‌పెక్టర్.

''కేసు ఎవరిమీద పెడతారు?''

''ఎవరిమీదేంటి సార్। గాడిదమీదే''

''ఏ గాడిదని పెడతారు. ఐమీన్ కాంగ్రెసు గాడిదనా? తెలుగుదేశం గాడిదనా?''

''ఇంకా అది తేలలేదు. గాడిదను ప్రశ్నించింతర్వాత తేల్చి చెబుతాను సార్'' అన్నాడు ఇన్స్పెక్టర్.

''సరే అదేదో త్వరగా తేల్చి నాకు చెప్పండి'' అని ఫోన్ పెట్టేశారు ఛేర్మన్‌గారు. ఫోన్ పెట్టేసి సెంట్రీని పిలిచి గాడిదను తీసుకువచ్చి తనముందు హాజరు పరచమని ఆర్డరు వేశారు ఇన్స్పెక్టర్‌గారు.

లాకప్‌లోంచి గాడిదను తీసుకువచ్చి హాజరు పరిచాడు సెంట్రీ.

ఇన్స్పెక్టరుగారు గాడిదకేసి కోపంగా చూస్తూ సెంట్రీని వెళ్ళమన్నట్లుగా సంజ్ఞ చేశారు.

ఆకలితో వున్న గాడిద ముందుగా ఇన్స్పెక్టర్‌గారి ఫైళ్ళని చూసి మేత దొరికిందని ఆనందిస్తూ ఆ తర్వాత ఇన్స్పెక్టర్‌గారి కేసి కొత్త యజమానిని చూసినట్లు కృతజ్ఞతతో చూసింది.

యిదేమీ గమనించకుండానే ఇన్స్పెక్టర్‌గారు ''నీ పేరు?'' అనడిగేరు – తెల్ల కాగితం తీసి ముందుంచుకొంటూ.

గాడిద అలాగే చూస్తుండిపోయింది.

ఇన్స్పెక్టరు గారు కోపంతో రెచ్చిపోయి, ''నిన్నే అడుగుతోంది, నీ పేరు?'' అన్నారు.

గాడిద అలాగే చూస్తూండిపోయింది.

ఇన్స్పెక్టరు గారు కోపంతో రెచ్చిపోయి, ''నిన్నే అడుగుతోంది, నీ పేరు?'' అన్నారు.

గాడిద తల వంచుకొని ఫైళ్ళకేసి చూస్తూండిపోయింది. ఇది చూసి టాలరేట్ చెయ్యలేక ఇన్స్పెక్టరు గారు లాఠీతో గాడిదను రెండు తగిలించి, ''ఇప్పుడు చెప్పు'' అన్నారు.

అప్పటికీ గాడిదేమీ చెప్పలేదు. కాబట్టి, తనే సమాధానం చెప్పుకొని, 'గాడిద' అని రాసుకొన్నారు. తరువాత ''ఏ వూరు?'' అని ప్రశ్నించేరు.

ఈసారికూడా సమాధానం చెప్పలేదు. ఇన్స్పెక్టర్‌గారు అంతకుముందు తనను ఎందుకు కొట్టారానని ఆలోచిస్తూండిపోయింది. ఇన్స్పెక్టర్‌గారికి తిరిగి కోపం రాగా ఆవేశంతో లేచి వెళ్ళి, ''నేను అడిగిందానికి సమాధానం చెప్పవుటే ... ఎంత బలుపు నీకు'' అంటూ చిక్కిపోయి వున్న గాడిదను చిత్తుగా కొట్టేరు. గాడిద మవునంగా దెబ్బలన్నీ భోర్చుకుంది. దాని దృష్టంతా టేబుల్‌మీద వున్న ఫైళ్ళమీదే వుంది.

చివరకు చేతులు నొప్పిపుట్టగా విసిగిపోయి వచ్చి తలపట్టుకు కూచుని ఆ వూరి పేరే రాశారు. తరవాత ఆ గాడిద ఏ గాడిదో తేల్చి కేసు వివరాలు రాయాలనుకున్నారు. దొరికిన సాక్ష్యాలను బట్టి చూస్తే గాడిద తెలుగుదేశందేనని స్పష్టమవుతోందనిపించింది. అది కాంగ్రెసు పార్టీ పోస్టర్ని తిన్నదానినిబట్టి, కాంగ్రెస్ కార్యకర్త చెప్పిందాన్ని బట్టి చూస్తే యిది ఖచ్చితంగా తెలుగుదేశం గాడిదేనని తేల్చి చెప్పొచ్చనిపించింది. కాని తెలుగుదేశం వాళ్ళు దానికి వప్పుకోవడం లేదు కదా! కేసును గురించి ఆలోచిస్తూ వుండగానే ఫోన్ మోగింది. రిసీవరు అందుకొని విసుగ్గా 'హలో' అన్నారు.

'హలో' అంటూ అవతలివైపు నుంచి తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి కంఠం వినిపించింది. ఆ కంఠం వినడంతోటే ఇన్స్పెక్టర్ గారు ''నమస్కారమండీ'' అన్నారు.

''ఇంతకు ముందు కొట్లాటలో గాడిద ఏ పార్టీకి చెందిందని తేల్చేరు? అడిగాడు అధ్యక్షుడు.

''ప్రత్యక్ష సాక్ష్యాల్ని బట్టి చూస్తే ఆ గాడిద మాదయితే కాదు. మీరు ఎలాగైనా సరే అది కాంగ్రెసు గాడిదని ఫైల్ చేయాలి'' అన్నారు అధ్యక్షులవారు.

''చూస్తానండీ''

''చూస్తాను అని కాదు చెయ్యండి'' అని ఒక క్షణం ఆగి తను ఏదో గుర్తుతెచ్చుకున్నట్లు, ''అన్నట్లు రేపు నేను హైదరాబాదు వెళ్తున్నాను. ఆ మధ్యన మీ ప్రమోషన్ గురించి చెప్పేరు కదా! ఆ సంగతేదో చూస్తాల్లెండి'' అని చెప్పి ఫోను పెట్టేశారు అధ్యక్షులవారు.

ఫోన్ పెట్టేసి ఆ గాడిదను కాంగ్రెసు గాడిదగా ఎలా చేయాలని ఆలోచిస్తూ కూచున్నారు ఇన్స్పెక్టర్. అంతసేపూ నిలువునా నిలబడిపోయి వున్న గాడిదకు విసుగు పుట్టింది. కాళ్ళు పీక్కుపోయి కడుపులో ఆకలి మండిపోతుండగా ఓపిక నశించి ఫైళ్ళ మీదకెగబడి ఓ ఫైలందుకుని పరపరా నమిలి తినసాగింది.

ఇది చూడగానే ఇన్స్పెక్టర్‌గారికి వెర్రెత్తిపోయి కోపంతో గాడిదను చావ చితకబాదారు. వళ్ళంతా చీరుకుపోయి దానికి రక్తం కారసాగింది. ఇంకా కొడితే అది ఛస్తుందనే అనుమానంతో, పైగా యిది ఎమర్జెన్సీ కాదని జ్ఞాపకం రావడంవల్లా, దాన్ని కొట్టడం మానేసి కానిస్టేబుల్‌ని పిలిచి దాన్ని తీసుకుపోయి లాకప్‌లో వేయమని ఆజ్ఞాపించారు.

తర్వాత ఇన్స్పెక్టర్‌గారికి యిది కాంగ్రెస్ గాడిదేననడానికి వో బ్రహ్మాండమైన ఆలోచన తట్టింది. రాష్ట్రప్రభుత్వం తెలుగుదేశంది కాబట్టి అది అధికార పార్టీ ఫైళ్ళని తిన్నది కాబట్టి అది అపోజిషన్ పార్టీకి సంబంధించిందేనని ఖచ్చితంగా చెప్పవచ్చునీ, అపోజిషన్ పార్టీ కాంగ్రెసు కాబట్టి అది కాంగ్రెసు గాడిదేనని నిరూపించ వచ్చునుకున్నారు. ఎందుకైనా మంచిదని యీ వర్గాలనుంచి సాక్షుల్ని పెట్టారు.

మర్నాడు ఉదయాన్నే గాడిదను కానిస్టేబుల్స్‌కిచ్చి కోర్టుకు పంపించేరు ఇన్స్పెక్టర్‌గారు.

కోర్టులో కేసు ఓడిపోతే పార్టీ పడిపోయినట్లు భావించి కాంగ్రెస్, తెలుగుదేశం వర్గాలవాళ్ళు పోటీపడి ప్రమాణాలు చేసి నిజం కాక అబద్దపు సాక్ష్యాలు బలంగా చెప్పారు. సాక్ష్యాలన్నీ విన్న మేజిస్ట్రేటు గారు ఎటూ తేల్చుకోలేకపోయారు. గాడిద కాంగ్రెసుదా, తెలుగుదేశందా అని తీవ్ర మీమాంసలో పడ్డారు. చివరికి గాడిదతోటే సాక్ష్యం చెప్పించి నిజం పలికించాలనుకున్నారు.

అందుకని ముందుగా గాడిదతో ప్రమాణం చేయించమని గుమాస్తాని పురమాయించారు.

గుమాస్తా భగవద్గీతని తీసుకువచ్చి గాడిదముందు నిలబడి ''దేవుని ఎదుట'' అన్నాడు.

భగవద్గీతని చూడగానే గాడిద కడుపులో ఆకలి భగ్గున బడబాగ్నిలా రగిలిపోయింది. వెంటనే అది భగవద్గీత నందుకొని నోటితో పరపర నమిలి తినసాగింది. ఇది చూసి ప్రేక్షకులు గొల్లున నవ్వుకున్నారు. మేజిస్ట్రేటుగారికి మతిపోయినంతపనైంది. ''సైలెన్స్, సైలెన్స్'' అనరిచేరు.

ప్రేక్షకులంతా సైలెన్సయిపోయారు. గాడిద భగవద్గీత తినడం పూర్తి చేసి గుమస్తాకేసి, మేజిస్ట్రేటు కేసి కృతజ్ఞతతో చూసింది.

మేజిస్ట్రేటు గారు కొద్దిసేపు ఆలోచించి, ''గాడిద కాంగ్రెసుది కానీ, తెలుగుదేశంది కానీ కాదు. మనకిపుడు కనిపించిన ప్రత్యక్ష సాక్ష్యాన్ని బట్టి యిది కమ్యూనిస్టు గాడిదని చెప్పవచ్చు. ఎందుకంటే కమ్యూనిస్టులకు దేవుడంటే నమ్మకం వుండదు. ఇప్పుడు గాడిద భగవంతుడు కాకపోయినా మనం భగవంతుడిలా చూసుకొనే భగవద్గీతను లక్ష్యపెట్టకుండా మనం చూస్తూ వుండగానే నమిలి తిన్నది కాబట్టి యిది ఖచ్చితంగా కమ్యూనిస్టు గాడిదే''నని ఫైండింగ్ యిచ్చేరు.

(తెలుగు కథ 1960-85)